క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హంటర్‌రోడ్డులోని టెంపుల్ ట్రీ విల్లా ప్రాంతంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమాన్ నగర్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విష్ణుపురి, కాజీపేట పోలీసు స్టేషన్, సోమిడి, రహమత్ నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రినగర్, రైల్వేస్టేషన్, డీ మార్ట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: ఎల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యురాలు హేమలతకు సన్మానం

కాజీపేట రూరల్: ప్రభుత్వ పశు వైద్యురాలు హేమలతను కాజీపేట బాపూజీనగర్‌లో జాంబవ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. బాపూజీనగర్‌కు చెందిన తాపీమేస్త్రీ లింగాల వీరస్వామి కుమార్తె హేమలత నెలక్రితం జగిత్యాలలో ప్రభుత్వ వైద్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాజీపేట జాంబవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు ఇమ్మడి రవి, ఉపాధ్యక్షుడు సిరిపాక కుమార్, కార్యదర్శులు ఇమ్మడి బాబు, గబ్బెట ఎల్లేష్, సిరిపాక ప్రశాంత్, గబ్బెట కరుణ్, కాళేశ్వరం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐతో వాగ్వాదం

వరంగల్ క్రైం: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పబ్లిక్ గార్డెన్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిలిపి ఉంచిన ఓ ప్రైవేట్ బస్సు టైర్లలోని గాలిని ట్రాఫిక్ పోలీసులు తీసినందుకు సదరు బస్సు యజమాని హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డితో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో పెట్రోల్ పంప్ వద్ద ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డితో సదరు బస్సు యజమాని గొడవకు దిగినట్లు సమాచారం.

పోలీసుల ఫిర్యాదు

కాజీపేట అర్బన్: విధుల్లో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మడికొండ ఇన్‌స్పెక్టర్‌కు ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం మడికొండలోని మెట్టుగుట్ట వద్ద హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను తనిఖీలు చేస్తుండగా హోండా యాక్టివాపై వెళ్తున్న వ్యక్తిని ఆపగా, ఆ బైక్‌కు నంబర్ ప్లేట్లు లేవు. అనంతరం అతడు అక్కడి నుంచి వెళ్లి తన భార్యతో తిరిగి వచ్చి పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ అసభ్యకరంగా మాట్లాడారు. కాగా, ఆ సంఘటనను కానిస్టేబుల్ తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈమేరకు దారంగుల రవి, కల్పనపై ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తీగల జీవన్‌గౌడ్, మహమూద్ ముదసర్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, కార్యదర్శి హరిహర కుమార్, మహిళా కార్యదర్శి గోపికారాణి, క్రీడల కార్యదర్శి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు సాంబశివరాజు, రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్, మాలతి పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్..

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డీఈఓ వాసంతి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రఘుపతి, జిల్లా అధ్యక్షుడు బత్తిని శ్రీరామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య, జిల్లా బాధ్యులు బీమళ్ల సారయ్య, మనోజ్, రమేష్, శ్రీనివాస్, అబ్దుల్‌సత్తార్, కొమురయ్య, భూక్య సారయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్..

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రూపొందించిన నూతన సంవత్సర 2025వ క్యాలెండర్‌ను హనుమకొండలోని డీఈఓ చాంబర్‌లో డీఈఓ వాసంతి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బాసిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర ఏకాంతం, రాష్ట్ర కార్యదర్శులు దండ్రి రాజమౌళి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్..

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని 4వ డివిజన్ రెడ్డికాలనీలోని శ్రీభక్తమార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి గుర్రపు రమేష్, కోశాధికారి నరెడ్ల మహేందర్, బాధ్యులు దుంపేటి నరేందర్ బాబు, బేతి రమేష్, గోరంట్ల రాజ్‌కుమార్, కూచన సురేష్, గంజి రాజేందర్, బత్తుల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ముంగిట్లో మురిపించే ముగ్గులు

- అతివల చేతుల్లో అందమైన హరివిల్లులు
- సంప్రదాయానికి ప్రతీకగా రంగవల్లులు
- సంక్రాంతికి వాకిళ్లు ముగ్గులమయం



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న అతివలు



ముగ్గు వేస్తున్న మహిళలు



కాజీపేట: సంక్రాంతి వేళ ఇళ్ల ముంగిట సంప్రదాయాల వెనుక దాగిన ఎన్నో జ్ఞాపకాలకు ముగ్గులు స్వాగతం పలుకుతాయి. అతివల చేతుల్లో హరివిల్లు అందాలు అవనిపై మనోహర దృశ్యకావ్యాలుగా కనువిందు చేస్తాయి. మహిళలు ఏ స్థాయిలో ఉన్నా అవన్నీ పక్కనబెట్టి తెల్లవారుజామునే లేచి ఎంతో ఉత్సాహంతో ముగ్గులు వేస్తారు. సంస్కృతీ సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం ఉన్న ముగ్గులు వేదకాలం నుంచి ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

నెలరోజుల పాటు ముగ్గులు

ధనుర్మాసం సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని నెలరోజుల పాటు వాకిళ్లలో ముగ్గులు వేస్తారు. ముగ్గులు వేయడానికి ఈ మాసం అంతా మహిళలు పోటీలు పడుతుండడం విశేషం. మహిళల కళా కౌశల్యానికి అద్దంపట్టే విధంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు కూడా పోటీలు నిర్వహిస్తున్నాయి. భోగి, సంక్రాంతి రోజుల్లో మాత్రం సాదరంగా రథంపై వీడ్కోలు చెప్పినట్లుగా ఉండే రథం ముగ్గును వేస్తారు. పేడ నీళ్లతో అలికి శుభ్రం చేసి సున్నపు పిండితో ముగ్గులు వేయడం వల్ల కాలుష్యం, క్రిమికీటకాలు దూరమవుతాయని పెద్దలు అంటుంటారు. ముగ్గు వేసే క్రమంలో చుక్కలు కలుపుతూ ఒక ఆకారాన్ని తీసుకొచ్చే క్రమంలో మహిళలు అనేకసార్లు పైకిలేవడం, కూర్చోవడం చేస్తుంటారు. ఇలాంటి వ్యాయామం ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. వేసిన అందమైన ముగ్గుల మధ్య ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పెట్టి నవధాన్యాలు, రేగుపండ్లను పోస్తూ సంతోషిస్తుంటారు.

ఆరోగ్యరీత్యా మంచిది



ముగ్గులు వేయడంతో పాటు అంతకుముందు కళ్లాపి చల్లడం ఆరోగ్యానికి మంచిది. నిత్యం ముగ్గులు వేయడం వల్ల స్త్రీలకు వ్యాయామం కూడా అవుతుంది. అనేక రంగులతో ముగ్గులు వేయడం వల్ల మానసిక ఆనందం కలుగుతుంది. - సరోజనీదేవి, విష్ణుపురి

హోదాలు మరిచిపోతారు



ముగ్గులు వేసే సమయంలో మహిళలు తమ హోదాలను మరిచిపోయి చిన్నపిల్లల మాదిరిగా ఉత్సాహంతో ముగ్గులు వేస్తారు. ముగ్గుల వల్ల అనేక ఆరోగ్యకర ప్రయోజనాలు ఉన్నాయి. - కటకం స్వప్న, వడ్డేపల్లి

సృజనాత్మకతకు ముగ్గులు దోహదం



బహుమతి ప్రదానం చేస్తున్న శ్రీనివాస్



కేయూ క్యాంపస్: ముగ్గును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు

వరంగల్ చౌరస్తా: మహిళల్లో దాగిఉన్న ప్రతిభ, సృజనాత్మకతకు ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడుతాయని ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ అన్నారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి గందె శ్రీనివాస్ గుప్తా, మహిళా సంఘం అధ్యక్షుడు చొల్లేటి కళావతి, కోశాధికారి తాటిపెల్లి రాజమణి, ప్రతినిధులు సుప్రియ, సంపూర్ణ, ధనలక్ష్మి, ఇతర విభాగాల ప్రతినిధులు యాద గణేష్, హరి, దాచేపల్లి సీతారాం, శ్రీరామ్ శ్రీనివాస్, సోమ అశోక్, అల్లాడి బద్రి, బొజ్జ వెంకటేశ్వర్లు, పుల్లూరు రవి, పాల మురళి, చొల్లేటి కిషన్, పరమేశ్వర్, మిత్తింటి సురేందర్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ముగ్గుల పోటీలు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ ప్రతీ ఏడాది లాగే ఈసారి కూడా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, చందులాల్, సుచరిత, శ్రీలత పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

విద్యారణ్యపురి: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని హనుమకొండలోని సుబేదారిలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థినులకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఆరెపల్లి సుజిత్, మహిళా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుశ్రీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్‌కుమార్, శ్రీలక్ష్మి, రాజ్‌కుమార్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ కాంట్రాక్టు అధ్యాపక సంఘం కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు అనేక రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి సంఘం బాధ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ సతీష్, డాక్టర్ సాదు రాజేష్, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, మాదాసి కనకయ్య, సత్య జూల, భిక్షపతి, నాగయ్య, సూర్యనారాయణ, నాగేశ్వర్‌రావు, లింగయ్య, సదాశివుడు, చంద్రశేఖర్, రమేష్, శ్రీధర్‌రావు, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వ్యాఖ్యలు సిగ్గుచేటు



బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: మహిళలంటే గౌరవ, మర్యాదలు లేకుండా వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసే వ్యక్తికి బీజేపీ టికెట్ ఇవ్వడం సిగ్గుచేటని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకగాంధీపై ఢిల్లీలోని కల్కాజీ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదూరి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ హనుమకొండలోని డీసీసీ భవన్ జంక్షన్‌లో బీజేపీ దిష్టిబొమ్మను మంగళవారం సాయంత్రం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ రమేష్ బిదూరి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎవరి భవిష్యత్‌కు వారే నిర్మాతలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న దామోదర్

హసన్‌పర్తి: ఎవరి భవిష్యత్‌కు వారే నిర్మాతలు అని సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. హసన్‌పర్తి కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 'సంస్కార – వికాసం' అనే అంశంపై మంగళవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య మాట్లాడుతూ సన్మార్గంలో నడిస్తేనే భవిష్యత్ సక్రమంగా ఉంటోందన్నారు. జాతీయ నాయకుల చరిత్రను చదివి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమదేవి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, ఉపాధ్యాయులు గోపురాజు సారయ్య, శీలం పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

పీడీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వరంగల్ అర్బన్: నీతి అయోగ్ సూచన చేసిందనే పేరుతో రైతుల పత్తి పంటను సీసీఐ కొనుగోలు చేసి చెల్లిస్తున్న ఎంఎస్పీ విధానాన్ని కేంద్రం ఎత్తేసే కుట్ర చేస్తోందని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు విమర్శించారు. వరంగల్ అబ్బనికుంటలోని రైతు భవన్‌లో కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ, ప్రైవేట్ కొనుగోలుదారులకు మధ్య ఉన్న వ్యత్యాస ధరను 15శాతానికి మించకుండా చూడాలని, కొనుగోలు చేసిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదును సీసీఐ జమ చేయాలని సూచించారు. ప్రైస్ డిప్యూటీ పేమెంట్ స్కీం (పీడీపీఎస్) విధానాన్ని ఏఐకేఎఫ్, తెలంగాణ రైతు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షుడు బాషపాక రమేష్, కోశాధికారి సంపత్ కుమార్, నాయకులు నరసయ్య, క్రాంతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు పక్షపాతి



మడికొండ: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి అన్నారు. రైతు భరోసా అమలుకు కేబినెట్ ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి హసన్‌పర్తి మండల కేంద్రంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్లు జె.రవి, బల్సుకూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు పుల్లా రవి, మదన్‌గౌడ్, పూల, కిరణ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మడికొండ: మడికొండ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, సారంపల్లి వాసుదేవరెడ్డి, కుర్ల మోహన్, వస్కుల నాగరాజు, బైరి లింగమూర్తి, శంకర్, రఘుచందర్, బిల్లా రవీందర్, రాజారపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు



ఖిలా వరంగల్: విధి నిర్వహణలో అనేక రకాల ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు, పోలీసుల మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. వరంగల్ కరీమాబాద్‌లోని రామస్వామి గుడి క్రీడామైదానంలో క్లాసిక్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ.అక్తర్ ఆధ్వర్యంలో కాకతీయ ప్రీమియర్ లీగ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్లి రవి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సైలు శ్రీకాంత్, సురేష్, కానిస్టేబుళ్లు పూర్ణ, నరేందర్, ప్రవీణ్, జర్నలిస్టులు కోటి, శంకర్, చిన్నబాబు, రవి పాల్గొన్నారు.

నూలు దారాన్ని వినియోగించాలి



హసన్‌పర్తి: పతంగులను ఎగురవేయడానికి నూలు దారాన్ని వినియోగించాలని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సూచించారు. పాఠశాల పర్యావరణ మిత్ర ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో కాగిత పతంగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా మాంజాతో మనుషులు, పశుపక్షులకు హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం

వరంగల్ క్రైం: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తన కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. వరంగల్ జిల్లా సంగెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు.. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఈశ్వర్ సహకారంతో 'సే నో టూ డ్రగ్స్' అనే నినాదంతో పనికిరాని కాగితాలతో రూపొందించిన ప్రచార సామగ్రిని సీపీ మంగళవారం పరిశీలించి ఆ విద్యార్థులను అభినందించారు. చిన్నారుల ప్రయత్నం అభినందనీయమని, పాఠశాల స్థాయి నుంచే మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు.

వేగం కన్నా ప్రాణం చాలా ముఖ్యం



వాహనానికి రేడియం స్టిక్కర్ వేయిస్తున్న ఎంవీఐ

ఖిలా వరంగల్: వాహన వేగం కన్నా తమ ప్రాణం ముఖ్యమని, బైక్‌పై ప్రయాణంలో హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జైపాల్ రెడ్డి, శోభన్‌బాబు సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై వరంగల్ రవాణాశాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వాడకంపై వాహన డ్రైవర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టాటాఏస్ వాహనాలకు హెడ్ లైట్లు, రేడియం స్టిక్కర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త చాలా అవసరమని వివరించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు మద్దెల నరేందర్, ఏఎంవీఐలు మద్దెల నరేందర్, గుగులోతు ఉదయ్‌కుమార్, సిబ్బంది, వాహనచోదకులు పాల్గొన్నారు.

హమాలీలకు గౌరవ వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న బత్తుల రమేష్ బాబు

హన్మకొండ: రేషన్ డీలర్లతో పాటు సివిల్ సప్లై హమాలీలకు గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సివిల్ సప్లై హమాలీలు చేస్తున్న సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరుకుంది. హనుమకొండ గోకుల్‌నగర్‌లోని సివిల్ సప్లై గోదాంల వద్ద చేపట్టిన దీక్షలను బత్తుల రమేష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ హమాలీలతో చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేయకుండా అన్యాయం చేస్తోందని వాపోయారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అమలు చేసే వరకూ పోరాటం ఆగదన్నారు. సమ్మెలో ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల ధర్మరాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి తోట సమ్మయ్య, బాధ్యులు ఆకుల పోతరాజు, రమేష్, గౌరీ, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బత్తిని సదానందం, నాయకులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



విద్యారణ్యపురి: మాట్లాడుతున్న బొట్ల చక్రపాణి

విద్యారణ్యపురి: రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం వద్ద మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్, ఐరన్, ఇతర షాపుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు రోజుకు 10నుంచి 12గంటలు వరకు కష్టపడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కమిటీ బాధ్యులు రవి, వెంకన్న, ఆదాం, మల్లేశం, అంజయ్య, కమల్, వెంకటప్ప, రాంమూర్తి, రమేష్, సదయ్య పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె విరమణ

ఖిలా వరంగల్: సివిల్ సప్లై గోదాముల్లో బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ హమాలీ కార్మికులు ఏడురోజులుగా చేస్తున్న సమ్మెను మంగళవారం విరమించారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రావటంతో సంఘం ప్రతినిధులు సమ్మెను విరమించినట్లు మంగళవారం ప్రకటించారు. బుధవారం నుంచి వరంగల్, ఖిలా వరంగల్, గీసుగొండ మండలాల్లోని రేషన్ షాపులకు బియ్యం పంపిస్తామని సంబంధిత గోదాం ఇన్‌చార్జ్ తెలిపినట్లు సమాచారం.

సంక్షిప్తంగా

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఈనెల 11న నిర్వహించనున్న మాదిగ మేధావుల రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని మాదిగ ఎంప్లాయీస్ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ డిమాండ్ న్యాయమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, బాధ్యులు సత్య జూల, తిరుపతి, మాదాసి కనకయ్య, స్వామి, భిక్షపతి, దాస్, చందర్, లింగన్న, మంద రాజు, కుమ్మరి రాజయ్య, సుశీల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

హన్మకొండ చౌరస్తా: పార్టీ కార్యకర్తలు, కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి, రామేశ్వరం గ్రామ పార్టీ అధ్యక్షుడు కిషన్ తల్లి, రాయపర్తి మండలం ఏకే తండాకు చెందిన మాజీ సర్పంచ్ చక్రును మంగళవారం ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మిస్సింగ్ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలి

వరంగల్ అర్బన్: ప్రజాపాలనలో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 40వ డివిజన్‌లో సుమారు 200 మంది ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

శ్వేతార్కుడికి వైభవంగా చిత్రాన్నపూజ



కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి స్వామివారికి మంగళవారం రాత్రి పులిహోరతో చిత్రాన్నపూజ వైభవంగా నిర్వహించారు. శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అర్చకుడు హరిస్వామి పంచామృత, పంచవర్ణాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకొచ్చిన పులిహోరను పాత్రాశుద్ధి పుణ్యాహవచనం జరిపించి, మంగళ వాయిద్యాల నడుమ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం పులిహోరను రాశిలా పోసి పోష్యలక్ష్మి, అన్నపూర్ణదేవతల ఆహ్వాన పూజలు జరిపించారు.